# మా ఉద్యమం

ఇప్పుడా? మా ఉద్యమం ప్రారంభించి, శిబిరం నెలకొల్పి రెండు పుష్కరాలయింది. అంతకు పూర్వం ఏదో సారస్వతసేవ చేస్తూ వుండే వాళ్ళంగానీ నిజమైన ఉద్యమం లేదు. మాకు జీవం ఇచ్చింది వేదాంతిగారు.

వేదాంతి యుగపురుషుడు. కేవలమూ ఆ సరస్వతి అవతారం. ఆయన జీవిత చరిత్ర అచ్చవుతోంది. తాను వెనక శృంగార ప్రబంధాలు, అపరాధ పరిశోధక నవలలు విరివిగా చదివి సరస్వతి కెంత అపచారం చేసిందీ ఆయన అందులో దాపరికం లేకుండా చెప్పుకున్నాడు. ఆయన జీవిత వివరాలిక్కడ ఇవ్వటానికి అవకాశంలేదు.

కానీ ఈ మహనీయుణ్ణి గురించి రెండు ముక్కలు చెబుతాను. దేశంలో ఉన్న రచయితల ఆర్థిక దుస్థితి చూసి ఈయన సర్వసంగ పరిత్యాగి అయి ఎప్పటికైనా దేశంలో భోజరాజ్యం స్థాపించాలని బద్ధకంకణుడైనాడు. సంఘంలో అన్యాయం ప్రబలి పెట్టుబడిదారులు మొదలైనవాళ్ళు రచనలకు పారితోషికాలంటూ పెట్టబట్టే సరస్వతి అధః పతనమయిందని ఆయన విశ్వాసం. సారస్వత సేవ మానవాదర్శంగా పాటించే మహనీయుడు. నియమయుతమైన జీవితము, బ్రహ్మచర్యము, సాత్వికాహారము, తాళపత్ర గ్రంథ రచనమూ మొదలైనవి రచయిత నుత్తేజపరుస్తాయి. మన సంఘంలో ప్రతి ఒక్కరూ ఒక అరగంట సేపయినా గంటం పట్టుకుని తాటాకుల మీద రాయాలి.

భోజరాజ్యం ఎప్పటికైనా రావాలంటే రచయితలు నిష్కామంగా రాయటం నేర్చుకోవాలి. ఏ విధమైన ప్రతిఫలమూ కోరరాదు. ఈ ఉద్యమానికి రచయితలు బలి అయిపోవాలి. యివ్వాళ మనం ఆత్మత్యాగం చూపనట్టయితే రేపు మన కక్షరలక్ష లెవరిస్తారు?

దురదృష్ట వశాత్తూ మా శిబిరంలోకి అనుమానాస్పదులంతా చేరారు. కొందరు చాటుగా పత్రికలకు వ్యాసాలుపంపి డబ్బు చేసుకుంటున్నట్టు తెలిసింది. మరికొందరు బహిరంగంగానే చేసుకునేవారు. అయితే వీరు ప్రఖ్యాతులు గనక వారు ఉద్యమంలోకి రావటమే చాలా ఘనమైన విషయంగా ఎంచబడింది.

మా వేదాంతిగారిని కొందరు విమర్శించసాగారు. ఆయనకు అనేకమంది

పత్రికాధిపతులతో దగ్గర సంబంధము ఉందని తప్పుపట్టారు. రేపు రాబోయే భోజరాజ్యంలో ఈ పత్రికాధిపతులే రచయితల హక్కులకు గార్డియను లవుతారనేది మూఢులు గ్రహించలేదు.

ఈ ఉద్యమముతో సారస్వతము ముందుకు వెళ్ళలేదని అనేకమంది ఆక్షేపించారు. ఇది కేవలమూ పొరబాటు. మేము సారస్వతం గురించి ప్రజలకెంతో బోధచేశాం. ఇవ్వాళ ప్రజా సామాన్యంలోకి సారస్వతమూ, సాహిత్యమూ, కళా, రచయితా, పఠితా అనే మాటలు వెళ్ళినా యంటే అది మా ఉద్యమ ఫలితమే. మేము వ్రాసిన తాళపత్ర గ్రంథాలు హెచ్చు ఖరీదైనా ప్రజలు త్యాగంచేసికొన్నారు. అంతకంటే ఉద్యమం ఫలించిన దనటానికింకేం కావాలి?

మాలో వామపక్షాన్ని మేమే పెరగనిచ్చామనటానికి నాకెంతో సిగ్గుగాఉంది. అచ్చు యంత్రాలుంటేనే గాని విరివిగా సాహిత్యము ప్రచారంగాదని, ఇన్నాళ్లై ఉద్యమము సాగుతున్నా ప్రజలకి సాహిత్యము అందడములేదని వాళ్లు వాదించారు. నిస్వార్థంగా సాహిత్యం సృష్టించటం ఉద్యమానికి బలంకాదని అన్నారు. ఇంతటితో ఆగినా సరిపోను. వీళ్లు మరో ఎత్తు ఎత్తారు. రచయితల హక్కులు పెంపు చేసుకోవటానికి రచయిత లందరినీ ఈ శిబిరంలోకి తెచ్చి సమ్మెలు జరిపించాలన్నారు.

ఇది సంస్కారహీనమైన సిద్ధాంతం. పత్రికాధిపతులమీద వత్తిడి తెచ్చే క్రూరమైన విధానం ద్వారా సంపాదించే హక్కులు సాహితికి ఉపచరించవు. పత్రికాధిపతుల హృదయాలు పరివర్తనం పొందాలి.

కానీ ఈ వామపక్షం తాలూకు ప్రభావం ప్రబలమయింది. రాను రాను శిబిరంలో అరాచకం ప్రబలింది. దీనికంతటికీ మూల కారకులైన వామపక్షాన్ని ఏ విధంగానైనా నిర్మూలించటానికి తీర్మానించాం. వాళ్ళని శిబిరంలో నుంచి వెళ్ళగొట్టాం. వాళ్ళు బయటికి వెళ్ళి రచయితల్లోపడి అన్ని రకాల రాతగాళ్ళనీ కూడగట్టి ఉద్యమం సాగించి మమ్మల్ని విమర్శించసాగారు. మాకు గత్యంతరం లేకపోయింది. ప్రజలని వాళ్ళమీదికి ఉసిగొల్పాం. తలకాయలు పగిలినై. హత్యలు కూడా జరిగినై. మమ్మల్నెవ్వరూ తప్పుపట్టలేదు. ఎందుచేతనంటే సమ్మెలనే క్రూర విధానంలో విశ్వాసం ప్రకటించింది వాళ్లే. అందుచేత వాళ్ళయెడల సాధు విధానాలెట్లా వర్తించుతై గనకా? సాధు విధానాలు పత్రికాధిపతులపట్ల ప్రకటించవచ్చు గాక!

అయితే చిక్కెక్కడ వచ్చిందంటే ఈ వామపక్షాన్ని వేటాడటంలో మేము అనేక రకాల వాళ్ళ సహకారం పుచ్చుకోవాలి సొచ్చింది మరి. అపరాధ పరిశోధక నవల్లూ, శృంగార ప్రబంధాలూ చదివేవాళ్ళనీ, డబ్బుకు రాసేవాళ్ళనీ, తాళపత్రాల మోహమూ,

గంటాల రూతము చూడనివాళ్ళనీ కూడా ఉపయోగించుకుని వామ పక్షాన్ని వేటాడాం. ఒక వంక ప్రజలు మమ్మల్ని తీవ్రంగా విమర్శిస్తున్నారు. మరోవంక మా వేదాంతి మా పద్ధతుల నామోదించటం లేదు. మాలో విచ్ఛిత్తి కలిగే సూచనలు కనిపించాయి. ఈ సమయంలో మార్గదర్శి అయిన వేదాంతి మాకు మహోపకారం చేశాడు. వామ పక్షాన్ని క్రూరపద్ధతులమీద వేటాడటం గురించి వోట్లు తీసుకునేటప్పుడు ఆయన చక్కని ఉపన్యాసం చేశాడు. తాను ఈ పద్ధతుల నామోదించకపోయినా తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించమని సలహాయిచ్చాడు. తన అనుచరులను తటస్థంగా వుండమన్నాడు. ఈ తీర్మానాన్ని పడగొట్టటానికి ఎవరైనా ప్రయత్నిస్తే తటస్థంగా ఉండే తన అనుచరులచేత తీర్మానానికి అనుకూలంగా వోటుచేయిస్తానని బెదిరించాడు.

ఈ విధంగా వామపక్షం వాళ్ళని వెళ్ళగొట్టుతూ ఈ శిబిరం ప్రతిష్ఠ కాపాడు కోగలిగాం. కానీ మా కష్టాలు పూర్తికాలేదు. ప్రజల్లో జరుగుతూవున్న అభిప్రాయ మార్పులవల్ల మేము రచయితల్ని కూడగట్టి వారిచేత సమ్మెలు చేయించటానికి, స్వార్థరాహిత్య సిద్ధాంతాన్ని విసర్జించి రచయితలు డబ్బుచేసుకోవటానికీ, తాళపత్ర లేఖనం ఐచ్ఛికం చేయటానికీ ఒప్పుకోవలసి వచ్చింది. ఈ మూడు సూత్రాల మీదా వామపక్షం వాళ్ళు రచయితా సామాన్యంలో పలుకుబడి సంపాదిస్తున్నారు. వామపక్షం వాళ్ళని పూర్తిగా సర్వనాశనం చెయ్యాలంటే వాళ్ళ నినాదాలన్నీ తెచ్చిపెట్టుకోక తప్పేటట్టు కనిపించలేదు.

ఇదివరకల్లా మా కాన్‌స్టిట్యూషన్‌లో మార్పు చెయ్యటానికి ఒక్క వేదాంతిగారి ఆమోదమే లేకుండా ఉండేది. ఆయన మా కెడమై పోతున్నాడన్న దిగులు మమ్మల్నీ, ప్రజానీకాన్నీ బాధించేది. ఇప్పుడాభయం తీరిపోయింది. ఇటీవల మా వేదాంతిగారు చేసిన ప్రకటన ప్రకారం మా శిబిరం ఈ మార్పులు చేసుకోవచ్చు. ఇట్లా మార్చటం మా వేదాంతిగారికేమీ ఇష్టంలేదు. గనక ఆయన మా కనుమతి ఇచ్చేశారు.

కనుక మేమిప్పుడు కోరేదేమంటే ప్రజలంతా మాలో కలిగిన మార్పులు గుర్తించాలి. మీ కిష్టమైన నినాదాలన్నీ మేమే పలుకుతాం. రచయితలు యూనియనులుగా చేరవచ్చు. సమ్మెలు చెయ్యవచ్చు. పత్రికాధిపతులంతా మనపక్షం ఉండటమేకాక, వారి ప్రతినిధులే యూనియనులు నడుపుతారు గనక మనం జయించి తీరుతాం. విద్రోహకులైన వామపక్షం నశించుగాక.

ఇది సర్వ విధాలా డెమోక్రసీతో కూడిన సంస్థ. ఫాసిస్టు రచయితల సంఘం కూడా మనలో చేరిపోతున్నది. బూర్జువా సాహిత్య సమితి వారు కూడా చేరినట్టే. ఈ విషయాలన్నీ గమనించి ప్రజలూ, రచయితా సామాన్యమూ మా ఉద్యమాన్ని బలపరుస్తారని ఆశిస్తున్నాము.

అచ్చులో ఉన్న వేదాంతి స్వీయచరిత్ర అందరికీ అందుబాటులో తాళ పత్ర ప్రతులుకూడా దొరుకుతాయి. దీని మీద లాభమంటూ వస్తే దాన్ని తాళపత్ర సంఘానికివ్వబడుతుంది.

***మొదటి ముద్రణ : ప్రజాశక్తి, 2 జూన్ 1946***